

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర -11లో▸

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.



ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. -11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$34^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత మరింత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామివారికి వార కల్యాణం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా.. ఏర్పాట్లను ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు పర్యవేక్షించారు. ధర్మసాగర్‌కు చెందిన తిరునగరి అరుణ్‌–నలిని, మోహన్‌–పద్మ దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్ రాజు, వేల్పుల గట్టయ్య, జంగిటి కుమార్, శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చంద్రగహణం సందర్భంగా మధ్యాహ్నం తర్వాత ఆలయానికి ద్వార బంధనం చేశారు.

ఎన్నికల సామగ్రి తరలింపు



జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 30వ తేదీన జరిగే ఎలక్షన్స్‌కు సంబంధించి జిల్లాలోని పోలింగ్ స్టేషన్ల వారీగా సామగ్రి తరలింపు కార్యక్రమం కొనసాగుతోంది. మెటీరియల్ పంపిణీ నిర్వహణ అధికారి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో 861 పోలింగ్ స్టేషన్లకు అవసరమైన సామగ్రి, సంబంధిత అధికారుల గైడ్ లైన్స్ సమాచార బుక్స్ మండలాల వారీగా పంపిణీ చేస్తున్నారు. వీటిని ఓటింగ్‌కు రెండు రోజుల ముందు జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ల్లో అధికారులు, పోలింగ్ సిబ్బందికి అందజేయనున్నారు.


పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12(డి) సమర్పించాలి

జనగామ రూరల్: అవకాశం, అర్హత మేరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగించాల్సిన వారు నవంబర్ 7వ తేదీ లోపు నిర్ణీత ఫారం 12(డి) భర్తీ చేసి సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని కలెక్టర్ శివలింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 80 ఏళ్లు నిండిన వారు, 40 శాతం వైకల్యం ఉన్న వారు, కోవిడ్ పాజిటివ్ కలిగిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే వెసులు బాటు ఉందని పేర్కొన్నారు. ఫారం 12(డి)ని నోడల్ అధికారుల నుంచి లేదా పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేస్తున్న వారు సంబంధిత ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లి ఓటు వేయాల్సి ఉంటుందని, ఒకసారి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న తరువాత ఎట్టి పరిస్థితుల్లో ఓటింగ్‌కు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: జిల్లా పరిధిలోని 108 అంబులెన్స్ వాహనాలపై అత్యవసర సేవలందించేందుకు ఈఎంటీ(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ సర్వీసు జిల్లా మేనేజర్ మండ శీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ గ్రూపులో డిగ్రీ(డిప్లొమా ఇన్ ఈఎంటీ, బీఎస్సీ(బైపీసీ) లేదా ఎస్ఎస్‌సీ పూర్తి చేసి ఏఎన్ఎం అనుభవం కలిగిన లేదా ఎస్ఎస్‌సీ కంప్లీట్ చేసి ల్యాబ్ టెక్నీషయన్‌గా అనుభవం ఉన్న 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 45 రోజుల శిక్షణ ఉంటుందన్నారు. ఈనెల 30న జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని 108 కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 80089 35522 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మద్దతు ధర కోసమే కొనుగోలు కేంద్రాలు



జనగామ రూరల్: రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా మద్దతు ధర పొందేందుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని పెంబర్తి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. సీఈఓ రాంమోహన్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఓటింగ్

దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయం

- పోలింగ్ కేంద్రాల్లో సకల సౌకర్యాలు
- ఉచితంగా రవాణా సదుపాయం
- 15,927 మంది దివ్యాంగ ఓటర్లు
- 470 లొకేషన్లలో ప్రత్యేక ఏర్పాట్లు



అడుగు తీసి అడుగు వేయలేక పోతున్నారా.. కళ్లు కనిపించడం లేదా.. వినికిడి సమస్య ఉన్న దివ్యాంగులు ఓటు వేయడానికి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. వైకల్యం ఉన్నవారికి ఎలక్షన్ కమిషన్ అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. ఇంటి నుంచి పోలింగ్ కేంద్రం వరకు ఉచిత రవాణా.. మంచం పైనుంచి కదల లేని స్థితిలో ఉన్నవారితో పాటు 80 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు ఇంటివద్దే ఓటు వేసే అవకాశాన్ని ఈసారి అమలులోకి తెచ్చింది. వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. - జనగామ

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల్లో 861 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 12 మండలాల పరిధిలో 15,927 మంది దివ్యాంగులు ఉన్నారు. 470 లొకేషన్లలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ఉచిత ట్రాన్స్‌పోర్టు ద్వారా పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావాల్సిన వారు 9,500 మందికి పైగా ఉన్నారు. డిసెంబర్ 30న జరిగే సాధారణ ఎన్నికల్లో వందశాతం దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ఎలక్షన్ కమిషన్ దృష్టి సారించింది. అన్ని వర్గాల ఓటర్లను చైతన్య పరుస్తూనే.. మరో వైపు దివ్యాంగులకు అన్నిరకాల సేవలను అందించేలా చర్యలు తీసుకుంటోంది. మాతా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖకు ఈ బాధ్యతలను అప్పగించింది.

కొత్తగా 12డీ ఫారం

దివ్యాంగులతో పాటు వయోవృద్ధులు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఈసారి కొత్తగా 12డీ ఫారాన్ని అందుబాటులోకి తెచ్చింది. 40 శాతం వైకల్యం కలిగిన వారు సదరం సరిఫికెట్ ఉండి, పోలింగ్ కేంద్రానికి రాలేని వారితోపాటు 80 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించింది. ఈనెల 31వ తేదీ వరకు వీరు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఓటింగ్ రోజున సంబంధిత అధికారులు ఇంటి వద్దకు వస్తారు.

ఉచిత రవాణా, ర్యాంపులు, వీల్ చైర్లు సిద్ధం

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దివ్యాంగులను గుర్తించిన లొకేషన్ల పరిధి పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల నిర్మాణం చేపట్టారు. ఒక్కో కేంద్రంలో వీల్ చైర్లు, ఇద్దరు చొప్పున వలంటీర్లు సేవలు అందిస్తారు. ఉచిత రవాణా కోసం గుర్తించిన ఓటింగ్ కేంద్రాల వద్ద ఆటో అందుబాటులో ఉంటుంది. అలాగే ఎటువంటి క్యూ లేకుండా నేరుగా ఓటింగ్ కేంద్రంలోకి పంపిస్తారు. దివ్యాంగులు ఉన్న ప్రాంతాలను ముందుగానే మ్యాపింగ్ చేసి అంధత్వం ఉన్న వారికి బ్రెయిలీ లిపి అవకాశం కల్పించనున్నారు. సీనియర్ సిటిజన్ల కోసం 1950 హెల్ప్ లైన్ నంబర్ కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు క్యూ లేదు. ఎండకు ఇబ్బంది కలుగకుండా టెంట్లు ఏర్పాటు చేస్తారు. తాగునీరు, టాయిలెట్ సదుపాయాలతో పాటు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి.



పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపు

జిల్లాలో దివ్యాంగుల ఓటర్ల వివరాలు			
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మొత్తం
జనగామ	3,074	2,091	5,165
స్టేషన్‌ఘన్‌పూర్	3,352	2,134	5,486
పాలకుర్తి	3,179	2,097	5,276
మొత్తం	9,605	6,322	15,927

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో దివ్యాంగులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఎలక్షన్ కమిషన్ నియమ, నిబంధనలు పాటిస్తూ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. వారికోసం కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, వీల్ చైర్లు, సహాయకులు, ఉచిత రవాణా సదుపాయం అందుబాటులో ఉంది. 40 శాతం వైకల్యం ఉన్నవారితో పాటు 80 ఏళ్ల వయసు పైబడిన వృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఉంది. ఇందుకు 12డీ ఫారంలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు విచారించి అనుమతి ఇస్తారు.

- సీహెచ్.శివలింగయ్య, కలెక్టర్

వాల్మీకి సందేశం నవతరానికి స్ఫూర్తి

- సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్

పాలకుర్తి టౌన్: వాల్మీకి అందించిన సందేశం నవతరానికి స్ఫూర్తిదాయకమని సాహితీవేత్త డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. మండల పరిధి వల్మిడిలోని మునులగుట్టపై వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ వాల్మీకి జీవన అనుకరణ మనందరికి మహోన్నత మార్గమని అన్నారు. చరిత్రకారుడు కేవీజీకే.ఆచార్యులు మాట్లాడుతూ వారసత్వ సంపదగా అలరారుతున్న వల్మిడి గ్రామ వైభవాన్ని, వాల్మీకి మహాముని స్ఫూర్తి, రామాయణ సందేశాన్ని అందుకుని ఉత్తమ పౌరులుగా నడిచి భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, వల్మిడి దేవస్థానం చైర్మన్ వీరమల్ల జైహింద్, సర్పంచ్ కత్తి సైదులు, ఎంపీటీసీ టి.సోమనారాయణ, అర్చకులు కల్యాణ సుందరాచార్యులు, ధర్మకర్తలు కేసారపు మల్లారెడ్డి, పర్వతి వెంకటయ్య, వాసురి భిక్షం, కొలువుల సుధాకర్, వీరమల్ల దేవేందర్, పూజారి మధు, చిలకమారి సోమేశ్వర్, మారిపెల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



వల్మిడి గ్రామస్తులతో శ్యాంప్రసాద్ తదితరులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

- డీసీపీ పి.సీతారాం

జనగామ: జీవితంలో ఎంత సంపాదించినా ఆపదలో ఉన్న ఒక్కరిని కాపాడగలిగితే ఆ సంతోషమే వేరు.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని డీసీపీ పి.సీతారాం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ జనగామ సబ్‌డివిజన్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని ఎస్ఎంఆర్ గార్డెన్‌లో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి డీసీపీ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. సబ్ డివిజన్ పోలీసులతో పాటు ఎన్నికల బందోబస్తు కోసం జిల్లాకు వచ్చిన కేంద్ర బలగాలు, పట్టణ ప్రజలు, యువకులు, తదితరులు రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి డీసీపీ, ఏసీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఎస్ఐలు సృజన్, అరుణ్, తిరుపతి, శ్వేత, సతీష్ పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న డీసీపీ తదితరులు

నేటి నుంచి టేబుల్ టెన్నిస్ పోటీలు



హసన్‌పర్తి: ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను ఆదివారం నుంచి రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు టేబుల్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు హరీశ్ తెలిపారు. అండర్–11, అండర్–13, అండర్–15, అండర్–17, అండర్–19 బాలబాలికల విభాగాలతో పాటు మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సింగిల్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా యువజన, క్రీడల అధికారి జి.అశోక్ కుమార్, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట: ఆదరించి గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దులగుట్టలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మండల పరిధి తమ్మడపల్లి, చిన్నరామన్‌చర్ల, పోచన్నపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వాసిగా ఇక్కడి సమస్యలు తెలుసునని, మండల అభివృద్ధికి రూ.64 కోట్లు మంజూరు చేయించగా.. ఇప్పటికే రూ.4 కోట్ల నిధులను గ్రామాల వారీగా కేటాయించినట్లు చెప్పారు. ఆశీర్వదించి గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లోని పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు బోడకుంటి వెంకటేశ్వర్లు, మండల శ్రీరాములు, ఇర్రి రమణారెడ్డి, ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, చెంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పూర్ణచందర్, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు మేకల కవితరాజు, ఖలీల్‌అజామ్, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. పోచన్నపేటలో రాజేశ్వర్‌రెడ్డికి స్థానిక మహిళ కుర్షిద్ జానీ తన ఒకనెల పింఛన్ డబ్బులను అందజేశారు. ఎన్నికల ఖర్చు కోసం ఉడతా భక్తిగా ఇచ్చినట్లు జానీ పేర్కొన్నారు.



తమ్మడపల్లిలో ప్రజలకు నమస్కరిస్తున్న 'పల్లా'

మరొక్క అవకాశమివ్వండి


- కాంగ్రెస్ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

నర్మెట: మీకందరికీ సుపరిచితుడనే.. మీ దయతో జెడ్పీటీసీగా, ఎమ్మెల్యేగా గెలిచాను.. మరొక్క అవకాశమివ్వండి మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధి గండిరామారం, దొంగల చెలిమెతండా, మాన్సింగ్‌తండా, ఇసుబాయితండా, సూర్యబండ తండా, మచ్చుపహాడ్‌తోపాటు పలు ఆవాసప్రాంతాల్లో ఆయన శనివారం పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. 'నాకు భూకబ్జాలు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమకేసులు పెట్టించడం తెలియదు. నర్మెటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మూడెకరాలు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు ఐదెకరాల భూమిని సొంతడబ్బుతో కొని ఇచ్చాను' అని అన్నారు. నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్సార్‌ను ఒప్పించి మండలంలో నాలుగు రిజర్వాయర్ల నిర్మాణానికి కృషి చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పదేళ్లుగా అభివృద్ధిలేక వెనుకబడిన ఈప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శులు గంగం నర్సింహారెడ్డి, భూక్య జయరాం, మాజీ జెడ్పీటీసీ గాదె మోహన్‌రెడ్డి, కొమురవెల్లి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి కుమారస్వామి, నాయకులు సురేందర్, యాట క్రాంతికుమార్, కరుణాకర్, బాలనర్సు, పరశురాములు, బాల్‌సింగ్, శ్రీధర్, బుర్రారాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. మండలంలోని పలుగ్రామాల నుంచి ఇతర పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



గండిరామారంలో మాట్లాడుతున్న కొమ్మూరి

ముగిసిన మహోత్సవాలు



కొడకండ్ల : స్థానిక యోగలింగేశ్వర సహిత శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శరత్కాల మహోత్సవాలు శనివారం ముగిసాయి. 15 రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరయ్యారు. చివరి రోజు పూర్ణాహుతి హోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' 'పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

- 1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

-10లో▸

కాంగ్రెస్ అంటే నయవంచన



ఘన్‌పూర్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు, పక్కన కడియం శ్రీహరి, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు తదితరులు

- రూ.50 కోట్లతో పీసీసీ పదవి కొనుక్కున్న రేవంత్ రెడ్డి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఆత్మీయ సమావేశంలో మంత్రి తన్నీరు హరీష్‌రావు

సాక్షిప్రతినిధి, వరంగల్/స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ అంటే నమ్మకం.. కాంగ్రెస్ పేరు చెబితేనే నయవంచనకు కేరాఫ్‌గా మాట్లాడుకుంటున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ప్రజలను నిమ్మంచి మోసం చేయడంలో కాంగ్రెస్ దిట్టని ఎద్దేవా చేసిన ఆయన.. బీఆర్ఎస్‌లో రిజక్ట్ చేసిన వారికి కాంగ్రెస్‌లో టికెట్లు ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితి ఆ పార్టీలో నెలకొందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరి అధ్యక్షతన శనివారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలవి మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసులో పట్టపగలు దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి, టీపీసీసీ పదవిని రూ.50 కోట్లకు కొనుగోలు చేశారని సొంత పార్టీకి చెందిన కోమటిరెడ్డి వెంటక్‌రెడ్డి అన్న మాటలను గుర్తు చేశారు. ఆ వ్యాఖ్యలు తప్పయితే రాహుల్‌గాంధీ వెంటక్‌రెడ్డిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే టికెట్లు రూ.5కోట్లకు అమ్ముకుంటున్నారని రేవంత్‌పై వస్తున్న ఆరోపణలను ఖండించలేకపోతున్నారన్నారు. మీ ఊర్ల ఓడిపోయినోళ్లు మా మీద(గజ్వేల్, సిరిసిల్ల, సిద్దిపేటలో) పోటీ చేస్తామని ప్రకటనలు చేయడం హాస్యాస్పదమని హరీష్‌రావు అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే కేసీఆర్ భరోసాతో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేస్తామని, ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు గడపగడపకు తీసుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. గులాబీ పార్టీకి కంచుకోట అయిన స్టేషన్ ఘన్‌పూర్‌లో ఈసారి కడియం శ్రీహరికి రికార్డు మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతిఒక్కరికీ సముచితస్థానం ఉంటుందని, బేధాభిప్రాయాలు లేకుండా పని చేయాలని సూచించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య కలిస్తే ఘన్‌పూర్‌లో రాష్ట్రంలోనే నంబర్‌వన్ మెజార్టీ వస్తుందన్నారు. అభ్యర్థి కడియం మాట్లాడుతూ.. రాజయ్య, తాను కలిసి జోడెద్దుల్లా పనిచేస్తే బీఆర్ఎస్‌కు తిరుగు ఉండదని, అందరూ కలిసి విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే రాజయ్య, ఎంపీ దయాకర్, ప్రభుత్వ చీఫ్ వినయ్ భాస్కర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండా ప్రకాష్, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ మేయర్ సుధారాణి, నాగుర్ల వెంకటేశ్వర్లు, నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, సీహెచ్.నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్నగుప్తా, చల్లా సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు హరీష్‌రావు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. సమావేశానికి ముందు మంత్రి హరీష్‌రావు హెలిప్యాడ్ నుంచి నేరుగా ఎమ్మెల్యే రాజయ్య నివాసానికి తేనేటి విందుకు వెళ్లారు. అయితే అక్కడ ఉన్న స్థానిక ఎస్సీ నాయకులు, కార్యకర్తలు మాదిగల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.



సభకు హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు

సాంస్కృతిక సారధి కళాకారులకు 'కోడ్'

- సర్క్యులర్ జారీ చేసిన ఎలక్షన్ కమిషన్

జనగామ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టు అమలులో ఉన్నందున తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులకు సైతం కోడ్ వర్తింస్తుందని సంబంధిత శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఈనెల 9 నుంచి ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు సారధి కళాకారులు ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు పాటించేలా పర్యవేక్షించాలని పౌర సంబంధాల అధికారులను ఆదేశించారు. రాజకీయ ప్రచార కార్యక్రమాలు, పార్టీల ఊరేగింపులు, వేదికల వద్ద పాల్గొనరాదని, అలాగే సోషల్ మీడియా (ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగామ్, యూ ట్యూబ్)లో ప్రచారాలు చేయవద్దని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి సూచనలను పాటిస్తూ ఓటర్లకు అవగాహన, ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై ప్రచారం చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే, క్రమ శిక్షణ చర్యలు ఉంటాయని, విచారణ అనంతరం అవసరమైతే సస్పెండ్ చేసే అధికారాన్ని కలెక్టర్లకు ఇచ్చారు.

శ్రీహరికి హరీష్ ఆత్మీయుడెలా అయ్యాడు

- మాజీ మంత్రి, బీజేపీ ఘన్‌పూర్ అభ్యర్థి డాక్టర్ గుండె విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ ఉద్యమ సమయంలో హరీష్‌రావును తన కాలిగోటికి సరిపోడని విమర్శించిన కడియం శ్రీహరికి.. ప్రస్తుతం ఆత్మీయుడు ఎలా అయ్యాడని మాజీ మంత్రి, బీజేపీ ఘన్‌పూర్ అభ్యర్థి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. డివిజన్ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో సీఎం కేసీఆర్ కడియంను తెలంగాణ ద్రోహిగా చిత్రీకరించారు.. ప్రస్తుతం ఆత్మీయులంటున్నారు.. ప్రభుత్వ ధనాన్ని కొల్లగొట్టేందుకే ఈ కలయిక అని పేర్కొన్నారు. హరీష్‌రావును దుర్భాషలాడిన శ్రీహరి ఏ స్వార్థం కోసం ఆయనతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. దేవాదుల రూపకర్త అని చెప్పుకుంటున్న కడియం.. ఆ ప్రాజెక్టు ఇంతవరకూ ఎందుకు పూర్తి కాలేదో చెప్పాలన్నారు. కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల తేలేదని, వైఎస్సార్‌ను బతిమిలాడి ఘన్‌పూర్‌కు తాను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తీసుకువచ్చానని అన్నారు. నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీష్ రావు, గతంలో మంత్రిగా పనిచేసిన కడియం వరద కాల్వ, దేవాదుల ప్రాజెక్టుపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను దగా చేసిన బీఆర్ఎస్ నేతలకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని, నియోజకవర్గ ప్రజలు ఆలోచించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, పార్టీ ఘన్‌పూర్ మండల అధ్యక్షుడు గట్టు కృష్ణగౌడ్, పెండ్యాల దిలీప్, తాటి సురేష్, వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, సంపత్, కె.రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుండె విజయరామారావు

తమ బలాలు, బలహీనతలు నాయకులకు తెలును. మంచినాయకుడు బలహీనతలు వదిలేస్తాడు. బలాలను పెంచు కుంటాడు.
- వారెన్‌బెన్నీస్



ఈసీ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు



జనగామ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 1950 కాల్ సెంటర్

జనగామ: ఓటర్ల వ్యక్తిగత సమాచారం, పోల్ సంబంధిత ఫిర్యాదులు, ఇతర సమస్యలు ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లేందుకు ఎలక్షన్ కమిషన్ టోల్ ఫ్రీ నంబర్–1950 అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రామాల వారీగా పోలింగ్ స్టేషన్లు, బూత్‌లెవల్ అధికారులు, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సంబంధించిన వివరాలు హెల్ప్‌లైన్ నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఓటు.. వజ్రాయుధం



ఓటు హక్కు వినియోగంపై శనివారం బాలసముద్రంలోని ఏకాశిల పార్కు నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని హనుమకొండ ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు.
- హన్మకొండ

జంగ్ తెలంగాణ

ప్రచారంలో 'పరీక్ష'..



బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ అభ్యర్థి, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ శనివారం కాజీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో ఓ ఆర్‌ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా బీపీ పరీక్షించుకున్నారు.

సోషల్ 'వార్'..

తొర్రూరు: ఎన్నికల వేళ టెక్నాలజీ వినియోగం విస్తృతంగా పెరిగిపోతోంది. సోషల్ మీడియాలో వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఫేస్‌బుక్‌లో పార్టీ ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం ఓటర్లకు విసుగు తెప్పిస్తోంది. గ్రామం, మండలం, నియోజకవర్గ స్థాయిలో నాయకులు వారికి తెలిసిన నంబర్లతో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ఒక పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే అతను ఇష్టం ఉన్నా.. లేకున్నా మొహమాటంతో పోస్టులు చూడలేక, చదవలేక సతమతమవుతున్నాడు. పొరపాటున ఎగ్జిట్ అయితే వారు తమ పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఒకే గ్రూపులోనే పార్టీకి అనుకూలంగా వ్యతిరేకంగా పోస్టులు సెండ్ చేస్తుండడంతో ఓటర్లు అయోమయానికి గురవుతున్నారు. ఏదీ ఏమైనా ఈ ఎన్నికల సీజన్‌లో వాట్సాప్ లొల్లితో ఓటర్లకు తిప్పలు తప్పడం లేదు.

సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి..





సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందించాలి

- ఎరియర్స్ ఒకే విడతలో నగదు రూపంలో చెల్లించాలి
- 'సాక్షి' పీపుల్స్ ఎజెండా'లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్ల స్పష్టీకరణ

సాక్షి 'పీపుల్స్ ఎజెండా'

రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు కోరారు. తెలంగాణ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'పీపుల్స్ ఎజెండా'లో వారు తమ డిమాండ్లను రాబోయే ప్రభుత్వాల ముందుంచారు. తమ పెన్షన్ నుంచి నెలకు ఒక్క శాతం చెల్లిస్తామని, తమకు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెష్ ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలని, గత పీఆర్‌ఎస్, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. చేతనైన సమయంలో జీవితం మొత్తం ఉద్యోగం కోసం వెచ్చించామని, విరమణ చేసి విశ్రాంతి తీసుకున్న తమ సంక్షేమాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.
- హన్మకొండ

నగదు రహిత వైద్యం అందడం లేదు



కార్పొరేట్ ఆసుపత్రుల్లో డబ్బు లేకుండా వైద్య అందడం లేదు. హెల్త్ స్కీమ్ ఏర్పాటు చేసి మాకు ప్రతి ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సంక్షేమం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.
- ఎస్ సోమయ్య, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు

కార్పొరేషన్ ఆవరణలో సబ్‌ట్రెజరీ ఆఫీస్ కొనసాగించాలి



నాలుగు సంవత్సరాల క్రితం వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సబ్ ట్రెజరీ ఆఫీస్ ఉండేది. జిల్లాల విభజన తర్వాత హనుమకొండకు మార్చారు. తద్వారా వరంగల్ జిల్లాలోని సుమారు 7వేల మంది పెన్షనర్లం హనుమకొండకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం.
- మహ్మద్ నిజామొద్దీన్, రిటైర్డ్ ఎంఈఓ, సంఘం వరంగల్ సిటీ అధ్యక్షుడు

మొదటి తేదీన పెన్షన్ ఇవ్వాలి



కొన్ని సంవత్సరాల నుంచి ప్రతి నెల 6 నుంచి 15వ తేదీ మధ్యలో పెన్షన్ అందజేస్తున్నారు. అలాకాకుండా ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాలి. ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డీఏలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కరించి మమ్ములను ఆదుకోవాలి
- ఏ.సత్యనారాయణ, రిటైర్డ్ ఎస్‌టీఓ, సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి

సచివాలయంలోకి అనుమతించడం లేదు



మా సమస్యలు వివరిద్దామని రాష్ట్ర సచివాలయానికి వెళ్తే అనుమతించకుండా సీనియర్ సిటిజన్లను అవమానపరుస్తున్నారు. నిత్యావసరాల ధరలు అదుపు చేయకుండా ప్రభుత్వాలు మధ్య తరగతి ప్రజలపై భారం మోపుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి ధరలు నియంత్రించి సామాన్యులకు ఊరటనివ్వాలి.
- పగడాల సరళ, రిటైర్డ్ ఉద్యోగి

పైరవీ చేసిన వారికే పెండింగ్ బిల్లులు



మా బకాయిల గురించి నిత్యం ట్రెజరీ చుట్టు తిరిగినా రావడం లేదు. పైరవీల ద్వారా వెళ్లిన వారికే వస్తున్నాయి. నేరుగా వెళ్తే పని కావడం లేదు. మా సమస్యలు చెప్పుకోవడానికి జిల్లాల వారీగా టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేయాలి. ప్రతీ జిల్లా కేంద్రంలో పెన్షనర్ల కోసం ప్రత్యేకంగా ట్రెజరీ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలి.
- మంత్రి సతీష్, రిటైర్డ్ ట్రెజరీ అధికారి

పెన్షనర్ల సంఘానికి భవనం నిర్మించి ఇవ్వాలి



రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో పెన్షనర్లు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కోసం స్థలం కేటాయించి, భవనం నిర్మించాలి. పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ, బకాయి బిల్లులను వెంటనే విడుదల చేయాలి. వెల్‌నెస్ సెంటర్లలో సీనియర్ డాక్టర్లను నియమించి మందులు కొరత లేకుండా చూడాలి. ఓపీ రిజిస్ట్రేషన్ సమయంలో నెలకొన్న ఇబ్బందులు తొలగించాలి. అలాగే, ప్రతి ఒకటవ తేదీనే పింఛన్ అందజేసి ఆదుకోవాలి.
- సంజీవరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి

రీయింబర్స్‌మెంట్ రావడం లేదు



హెల్త్ స్కీం అమలుకు నోచుకోకపోవడంతో కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం డబ్బు చెల్లించాల్సి వస్తోంది. వైద్యం పూర్తయ్యాక రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే సకాలంలో అందక ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బా బేసిక్‌పే నుంచి ఒక్క శాతం కట్ చేసుకుని హెల్త్‌స్కీం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. డీఏ, ఇతర బకాయిలు వాయిదాల పద్ధతిలో కాకుండా ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలి.
- ఎంఏ జలీల్, రిటైర్డ్ ఉద్యోగి

వెల్‌నెస్ సెంటర్లలో ల్యాబ్ పరీక్షలు చేయాలి



వెల్‌నెస్ సెంటర్లలోని ల్యాబ్‌లో 60 రకాల పరీక్షలు చేస్తామన్నారు. కానీ ఒక్క పరీక్ష కూడా చేయడం లేదు. వ్యాధి తీవ్రత కోసం నిర్ధారణ పరీక్షలు చేయకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. వైద్యులు కూడా ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఉంటారో తెలియడం లేదు. అనుభవం కలిగిన డాక్టర్లతో పాటు మందుల కొరత లేకుండా చూడాలి. ల్యాబ్ పరీక్షలు అన్నింటినీ చేసేలా వసతులు కల్పించాలి.
- కె.రాజశేఖరయ్య, రిటైర్డ్ దేవాదాయశాఖ ఉద్యోగి

ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలి



రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆదాయ పన్ను నుంచి మినహాంపు ఇవ్వాలి. ఏటా ఆదాయ పన్ను ప్రతిపాదనలు పంపమనడంతో ఇబ్బందులు పడుతున్నాం. రైలులో ప్రయాణించేందుకు గతంలో రాయితీ ఉండేది. దానిని రద్దు చేశారు. ప్రస్తుతం ఆ రాయితీని పునరుద్ధరించాలి. ఉద్యోగులకు జీతాలతో పాటు పెన్షనర్లకు కూడా నెలలో మొదటి తేదీన పింఛన్ ఇవ్వాలి.
- చందుపట్ల నిరంజన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి

డీఏ, పీఆర్‌సీ చెల్లించాలి



ఆరు నెలల్లో మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. మాకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీని వాయిదాల పద్ధతిలో చెల్లించడం బాధాకరం. మునుపెన్నడూ ఇలా వాయిదాల పద్ధతిలో డీఏలు ఇవ్వలేదు. పెన్షనర్ల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి డీఏ, బీఆర్‌సీ, బకాయి బిల్లులు ఒకే విడతలో చెల్లించాలి. అప్పుడే మా కుటుంబాల ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయి.
- ఇ.శేషయ్య, రిటైర్డ్ ఉద్యోగి

జనరల్ టు ఎస్టీ రిజర్వ్..

1972 వరకు ములుగు జనరల్.. 1978లో ఎస్టీకి కేటాయింపు

- 1952లో ఏర్పడిన నియోజకవర్గ ప్రస్థానం ఇదీ..
- ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ
- 50,079 నుంచి 2,20,886 వరకు పెరిగిన ఓటర్లు
- కీలకంగా మారనున్న మహిళా ఓట్లు

ములుగు: ములుగు నియోజకవర్గంలో 1952లో తొలిసారి శాసన సభ ఎన్నికలు జరిగాయి. ఇందులో పీడీఎఫ్(పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరఫున హనుమంతరావు, కాంగ్రెస్ తరఫున రాజ్యలక్ష్మీ పోటీ చేశారు. ఇందులో రాజ్యలక్ష్మీకి కేవలం 6,540 ఓట్లు మాత్రమే వచ్చాయి. పీడీఎఫ్ అభ్యర్థి హనుమంతరావుకు 7,132 పోలై ములుగు తొలి ఎమ్మెల్యేగా రికార్డుల్లోకి ఎక్కారు. 1972 వరకు ములుగు జనరల్‌గా ఉంది. ఎస్టీ జనాభా ఎక్కువ ఉండడంతో డిలిమిటేన్‌లో భాగంగా 1978లో ఎస్టీ రిజర్వ్‌గా మారింది.

ఎక్కువ సార్లు గెలిచిన పార్టీలు కాంగ్రెస్, టీడీపీ

ములుగు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్, టీడీపీలే ఎక్కువసార్లు గెలుపొందాయి. కాగా టీడీపీ ప్రభుత్వంలో అజ్మీర చందూలాల్, పోరిక జగన్నాయక్ రెండు సార్లు మంత్రులుగా కొనసాగారు. ఇక 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అజ్మీర చందూలాల్.. కాంగ్రెస్ అభ్యర్థి సీతక్కపై 18,884 ఓట్లతో గెలుపొందారు. అనంతరం 2018 ఎన్నికల్లో ఏకంగా సిట్టింగ్ మంత్రి చందూలాల్‌పై 22,671 ఓట్లతో గెలుపొందారు.

భారీగా పెరిగిన ఓట్లర్లు..

1952 మొదలు.. 2023 సంవత్సరం వరకు 71 సంవత్సరాల్లో నియోజకవర్గ ఓటర్ల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. 1952తొలి ఎన్నికల్లో 50,076 మంది ఓటర్లు మాత్రమే ఉండగా 1985లో తొలిసారి 1,09,680 మొదటిసారి లక్ష సంఖ్య దాటింది. 1999లో 1,61,863 వరకు వచ్చింది. ఇక 2014లో రెండు లక్షలు దాటింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,20,886 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రభావం చూపనున్న మహిళా ఓటర్లు


2009 నుంచి ములుగు నియోజకవర్గంలో మహిళా ఓటర్ల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ సాధారణ ఎన్నికల్లో 1,08,588 మంది పురుషులు, 1,12,277 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించనున్నారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని 10 మండలాల్లో (మల్లంపల్లి నూతన) 3,089 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.



ములుగు నియోజకవర్గ కేంద్రం

2009లో మారిన నియోజకవర్గ ముఖచిత్రం

2009 సాధారణ శాసనసభ ఎన్నికల్లో ఒక్కసారి ములుగు నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారింది. గతంలో నియోజకవర్గంలో ఉన్న గణపురం అలాగే కొనసాగితే ములుగు జనరల్ అయ్యే అవకాశం ఉండేది. అదే విధంగా ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలో ఉన్న కొత్తగూడను నర్సంపేట నియోజకవర్గంలో కొనసాగిస్తే నర్సంపేట సైతం ఎస్టీగా కొనసాగేది. అయితే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే పొదెం వీరయ్య అంతర్గతంగా సమావేశమై పరిస్థితిని తారుమారు చేశారు. రిజర్వేషన్లు మారకుండా నల్లబెల్లిని నర్సంపేటలో, కొత్తగూడను ములుగులో, గణపురం(ఎం)ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలిపారు. దీంతో ములుగు ముఖచిత్రం మారి ఎస్టీ రిజర్వ్ అయింది.




చందూలాల్


సీతక్క


వీరయ్య


భోజారావు

నియోజకవర్గంలో పోటీ చేసిన వారి వివరాలు

సంవత్సరం	గెలుపొందిన పార్టీ	అభ్యర్థి	సమీప అభ్యర్థి	పోలైన ఓట్లు
1952	పీడీఎఫ్	హనుమంతరావు	రాజ్యలక్ష్మీ(కాంగ్రెస్)	23,869
1957	పీడీఎఫ్	రాజేశ్వర్‌రావు	కులు(కాంగ్రెస్)	28,865
1962	కాంగ్రెస్	కృష్ణయ్య	ప్రసాద్(సీపీఐ)	39,141
1967	ఇండిపెండెంట్	సంతోశ్ చక్రవర్తి	రామనర్సయ్య(సీపీఎం)	52,379
1972	కాంగ్రెస్	సంతోశ్ చక్రవర్తి	రావు(ఇండిపెండెంట్)	66,755
1978	కాంగ్రెస్	జగన్నాయక్	భోజరావు(జనతా)	64,320
1983	కాంగ్రెస్(ఐ)	జగన్నాయక్	అజ్మీర చందూలాల్(టీడీపీ)	64,474
1985	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	74,599
1989	కాంగ్రెస్	జగన్నాయక్	చందూలాల్(టీడీపీ)	1,02,475
1994	టీడీపీ	చందూలాల్	జగన్నాయక్(కాంగ్రెస్)	1,13,849
1996	టీడీపీ	భోజారావు	జగన్నాయక్(కాంగ్రెస్)	-
1999	కాంగ్రెస్	వీరయ్య	చందూలాల్(టీడీపీ)	1,15,227
2004	కాంగ్రెస్	వీరయ్య	సీతక్క(టీడీపీ)	1,18,383
2009	టీడీపీ	సీతక్క	పొదెం వీరయ్య(కాంగ్రెస్)	1,34,674
2014	బీఆర్ఎస్	చందూలాల్	సీతక్క(టీడీపీ)	-
2018	కాంగ్రెస్	సీతక్క	చందూలాల్(బీఆర్ఎస్)	1,68,780